# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





### ధరణితోనే ప్రజలకు మేలు

గతంలో రైతులు ధరణి లేకపోవడం వలన ఎన్నో ఇబ్బందులు పడేవారు. వాళ్ల తల్లితండ్రుల నుంచి వచ్చే భూమిని సైతం వాళ్ల పేరుకు మార్చడానికే ఎన్నో పైరవీలు చేసేవారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన ధరణితో సులువుగా పట్టా చేసుకుంటున్నారు. ఎవరికి కూడా ఒక్క పైసా ఇవ్వకుండానే నేరుగా తమ భూమి హక్కులు పొందుతున్నారు. ధరణితో మనభూమి పై హక్కులు మనకే ఉండడం అనేది కేసీఆర్ ఆలోచన, దీంతో ప్రతి రైతు సంతోషంగా ఉన్నాడు.

– విఠల్, రాయికోడ్ మండలం

### పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే ఆగం అయితం



ధరణి తీసేసి మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తే భూ రికార్డుల్లో మళ్లీ తప్పులు చేరుతయి. రైతులమంతా పట్వారీల చుట్టూ తిరగాలే. అప్పటి భూముల ఇబ్బందులు ఇంకా తీరలే. ధరణి వచ్చినంకనే సమస్యలు మెల్లగా తీరుతున్నయి. భజన చేసేటోళ్లకే అండదండలు ఉంటయి. ధరణి వచ్చినంక అందరికీ ఒకటే తీరు పని జరుగుతుంది. కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తం అంటే మేము మాత్రం ఓటు వేయం. సీఎం కేసీఆర్‌కే ఓటేస్తం.


– మర్రి మధురెడ్డి, జిన్నారం మండలం



### 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు

వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు. ఎకరాకు 3 గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి మాట్లాడటం ఆయన అవివేకం. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్ధరాత్రి పొలానికి కరెంట్ వేసి వచ్చేటోళ్లం. నిద్ర ఉండేది కాదు. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులకు ఎంతో మేలు చేస్తుండు. కాంగ్రెస్‌ని నమ్మితే కష్టాలు తప్పవు. 24 గంటల కరెంట్ ఇయ్యటంలో రైతులకు చాలా మేలు కలుగుతుంది. మరోసారి కేసీఆర్‌యే సీఎం అయితడు. ఆయనకే ఓటేస్తం.

– మైహిబూబ్‌పాటిల్, మామిడిపల్లి గ్రామం, రాయికోడ్‌మండలం



- కాంగ్రెస్ పాలనలో కరెంటు కటకటతో ఇబ్బందులు పడ్డాం
- మూడు గంటల కరెంటుతో పంటలు ఎండి అప్పల పాలైనం
- పట్వారీ వ్యవస్థతోనే ఆగమైనం
- రైతులను ముంచిందే కాంగ్రెసోళ్లు..
- కొత్తపాట పాడితే నమ్మేది లేదు
- బీఆర్ఎస్ పాలనలోనే సవ్యంగా కరెంటు
- సీఎం కేసీఆర్‌తోనే రాజులమయ్యామని రైతుల హర్షం

**పదేండ్ల క్రితం** కాంగ్రెస్ పాలనలో పడిన కష్టాలు చాలు. సరైన కరెంటు లేక వేసిన పంటలు వేసినట్లే మా కండ్ల ముందే ఎండిపోయాయి. సాగు కోసం చేసిన అప్పులు తీరక చనిపోయిన రైతులు ఇంకా గుర్తుకున్నరు. ఒకరి భూములు మరొకరి పేరుమీద రాసి రైతుల మధ్య చిచ్చురాజేసిన పటేల్, పట్వారీ వ్యవస్థతో ఎదుర్కొన్న ఇబ్బందులనూ మరువలేదు. ఇలా కాంగ్రెసోళ్ల పాలన అన్నింటా అన్నదాతలను ముంచిందే తప్ప.. మేలు చేసే ఒక్క పనైనా లేదు. తెలంగాణ రాకతో సీఎం కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో వ్యవసాయం పండుగైంది. ధరణితో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు వచ్చి భూ వివాదాలు తగ్గాయి. 24గంటల ఉచిత కరెంటుతో బోర్లన్నీ ఫుల్లుగా పోస్తున్నాయి. రైతుబంధుతో పెట్టుబడి రంది లేకుండా పోయింది. ఇలా ప్రతీది రైతుకు మేలు చేకూర్చే పథకమే. కేసీఆర్ పాలనలో రైతులంతా రాజులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో మళ్లీ వచ్చిన కాంగ్రెసోళ్లు.. రైతులను ఆగంజేసే పనులు చేస్తున్నరు. మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు, ధరణిని తీసేస్తామని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ రైతులను ముంచాలని చూస్తున్నరు. ఇంతటి కుట్ర చేస్తున్న కాంగ్రెసోళ్లను నమ్మితే మళ్లీ సచ్చే పరిస్థితే వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్తామని స్పష్టం చేస్తున్నారు.

– నమస్తే తెలంగాణ సంగారెడ్డి నెట్‌వర్క్, నవంబర్ 29

# హస్తం వస్తే చస్తం..

### నమ్మిచ్చి మోసం చేయాలనుకుంటున్నరు

కాంగ్రెస్ నాయకులు రైతులను పిచ్చోళ్లుగా చేస్తున్నరు. మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నరు. ఇప్పుడు 24 గంటల కరెంటు ఇస్తుంటే, కాంగ్రెసోళ్లు మూడు గంటలు ఇచ్చి 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని చెబుతున్నరు. ఎవుసానికి తక్కువ కరెంటు ఇస్తే అందరూ ఒకేసారి మోటరు చాలు చేస్తే, కరెంటుపై లోడుపడి మోటర్లు కాలిపోతాయి. గతంలో రైతులు ఎట్ల చెబితే అట్లా మాయ మాటలు నమ్మేవారు. ఇప్పుడు అంత తేలికగా నమ్మరు. అయినా ఏదేదో వాగ్దానాలు చేస్తూ రైతులను వెంబడిస్తున్నరు.

– రాంరెడ్డి, రైతు, సిర్గాపూర్ మండలం





### గతంలో మోటర్లు చాలా కాలిపోయేవి..

రాష్ట్రం ఏర్పాటుకాక ముందు కాంగ్రెస్ పాలించినప్పుడు రైతులకు చెందిన చాలా మోటర్లు కాలిపోయేవి. లోవోల్టేజీ సమస్య అప్పట్లో అధికంగా ఉండేది. గ్రామాల్లో కేవలం టూఫేస్ కరెంట్ సరఫరా ఉండేది. దీంతో త్రీఫేస్ కరెంట్ సరఫరా చేసినప్పుడు లోవోల్టేజీ సమస్య వచ్చేది. రాష్ట్రం ఏర్పాటు తరువాత రెండు, మూడు ఏండ్లల్లో 24 గంటల ఉచిత కరెంట్ ప్రారంభమైంది. వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్ సరఫరా కావడంతో లోవోల్టేజీ సమస్య తగ్గింది. అప్పటి నుంచి కాలిపోయిన మోటర్లు రావడం లేదు. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో చాలా వరకు రైతుల సమస్యలు తగ్గాయి. గ్రామాల్లో సైతం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం లేదు. సీఎం కేసీఆర్ వచ్చిన తరువాత ఇబ్బందులు తప్పాయి.

– బైరే అశోక్, బోరు మెకానిక్, కంగ్టి మండలం

### ధరణితోనే ప్రజలకు మేలు..



రాయికోడ్, నవంబర్ 28: గతంలో రైతులు ధరణి లేక పోవడం వలన ఎన్నో ఇబ్బందులు పడేవారు. వాళ్ల తల్లితండ్రుల నుంచి వచ్చే భూమిని సైతం వాళ్ల పేరుకు మార్చడానికే ఎన్నో పైరవీలు చేసేవారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన ధరణితో సులువుగా పట్టా చేసుకుంటున్నారు. ఎవరికి కూడ ఒక్క పైసా ఇవ్వకుండానే నేరుగా తమ భూమి హక్కులు పొందుతున్నారు. ధరణితో మనభూమి పై హక్కులు మనకే ఉండడం అనేది కేసీఆర్ ఆలోచన, దీంతో ప్రతి రైతు సంతోషంగా ఉన్నాడు

– సంగమేశ్వర్‌పాటిల్, మహ్మదాపూర్ గ్రామం, రాయికోడ్ మండలం

### మూడు గంటల కరెంట్‌తో కష్టాలే..



రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు రైతులకు అవమానపర్చినట్లే. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు రైతులకు ఏమాత్రం ఉపయోగపడవు. ప్రజలను మోసం చేసేందుకు పనికిమాలిన హామీలు చెయ్యడం తప్ప కాంగ్రెస్ వాళ్లకు మంచి చేయడం చేతకాదు. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు మూడు గంటల కరెంట్ సరిపోతుందనడం రేవంత్‌రెడ్డికి వ్యవసాయం అంటేనే అవగహన లేనట్లు అర్థం అవుతుంది. రైతు 10 హెచ్‌పీ మోటర్‌తో బావిలో గంటన్నర లోపు నీళ్లు మొత్తం ఖాళీ అయిపోతాయి. రైతులకు తర్వాత ఇబ్బంది అవుతుంది. రైతులందరూ ఒకేసారి నీరు పారిస్తే మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. కాంగ్రెస్ పార్టీకి ఓటే వేస్తే రైతుల కష్టాలే. రైతుల బాధలు తెలిసినోళ్లు ఇట్లా మాట్లాడరు. సీఎం కేసీఆర్ రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి. కాంగ్రెస్ మాయమాటలు నమ్మేస్థితిలో రైతులు లేరు.

– రామయ్య, రైతు, మేళసంగం, మునిపల్లి మండలం

## ఆ చీకటి రోజులు మర్చిపోలేం

### 10హెచ్‌పీ మోటరుతో పంటలు పండించడం అసాధ్యం

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 10 హెచ్‌పీ మోటరును బిగించి 3గంటల కరెంట్ సరఫరా చేస్తే సరిపోతుంది అనడం సిగ్గుచేటు. దేశంలోని ఏరాష్ట్రంలోనైనా 10 హెచ్‌పీ మోటరును బిగించి వ్యవసాయం చేసే రైతులు ఉన్నారా.? బావులకు సైతం కేవలం 5 నుంచి 7.5 హెచ్‌పీ మోటర్లను బిగించుకుని తమ పంటపొలాలకు నీటిని వదులుకుంటారు. పొలాల్లోని బోర్లకు కేవలం 3నుంచి 5 హెచ్‌పీ మోటర్లను మాత్రం వాడుకుంటాం. ఆపై హెచ్‌పీ మోటర్లను బిగించుకుంటే నీటిఊట తగ్గిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం కర్ణాటకలో కేవలం రోజుకు 3 నుంచి 5గంటల మాత్రమే కరెంట్ సరఫరా ఉంటుంది. దీంతో అక్కడ ఉన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ చీఫ్ రేవంత్‌రెడ్డి అనాలోచిత మాటలు మాట్లాడడం విడ్డూరంగా అనిపిస్తుంది. మరోమారు కేసీఆర్ పక్కాగా రావడం ఖాయం. ఇక్కడ ప్రస్తుతం 24 గంటల కరెంట్ సరఫరాతో పంటలను పండించుకొని సుఖంగా ఉంటున్నాం. గతంలో పాలించిన కాంగ్రెస్ వ్యవసాయులకు చేసిందేమీ లేదు.

– ఎల్.గజానంద్, రైతు, బోర్గి, కంగ్టి మండలం





### 10 హెచ్‌పీ మోటర్లు ఎవరిస్తరు..

పంటలకు నీళ్లు పెట్టడానికి ఏ రైతు దగ్గర కూడా 10 హెచ్‌పీ మోటరు లేదు. తక్కువ భూమి ఉన్న రైతులకు అలాంటి మోటర్లను కొనే శక్తి ఉండదు. కాంగ్రెస్ మూడు గంటల కరెంటు ఇస్తే అప్పుడు రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలి. రైతులకు ఎవరు మంచి చేస్తారో జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలి.

– మొగులయ్య, రైతు, కవేలి, కోహీర్ మండలం

### 10 హెచ్‌పీ మోటర్లు అవసరం లేదు

వ్యవసాయం కోసం రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఉన్నట్లు కరెంటు 24గంటలు సరఫరా చేస్తే చాలు. మూడు గంటల కరెంటు ఇస్తే ఎంత పొలం పారుతుంది. అందరూ ఒకేసారి మోటర్లు ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవుడు, దాంతో రైతులకు అదనపు ఖర్చు. కాంగ్రెస్ నాయకులు సోయి ఉండి మాట్లాడుతున్నరా? మళ్ల పాత బాధలు అవసరమా. ఇప్పుడున్న కరెంటే ఉండాలే. కేసీఆర్ సారే మళ్లీ రావాలే. అట్లయితనే రైతులకు మేలు జరుగుతుంది.

– ఎండీ పాషా, బోర్ మోటర్ మెకానిక్, జిన్నారం మండలం





### పట్వారీల కాలం మాకొద్దు..

పట్వారీల కాలంల తసీల్ ఆఫీసుల అవసరముండి పని మీద పోతే నాలుగు రోజులైనంక కనిపించు అంటుండే. ఇప్పుడురా అప్పుడు రా అని తిప్పించుకునుడే. పని కావాలంటే పైసలు ఇస్తేనే అయ్యేది. అప్పటిలా రైతులు కష్టపడొద్దని సీఎం కేసీఆర్ సారు ధరణి తీసుకొచ్చిండు. భూములు అమ్ముకున్న, కొనుక్కున్నా కొత్తపాసుపుస్తకాలు వస్తున్నవి. అప్పుడు పాసు పుస్తకాలు రావాలంటే ఎంతకష్టమో మాకు తెలుసు. అప్పుడు ఒకరిపేరుమీద నుంచి ఇంకొకరి పేరుమీదకు పట్వారీలు రాసేటోళ్లు. అలాంటి కష్టం వద్దని భూములు భద్రంగా ఉండడానికి ధరణి తీసుకొస్తే ఇప్పుడు కాంగ్రెసోళ్లు పాతకాలంలా ఉన్న పట్వారీల కాలం తీసుకోస్తామంటున్రు. బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన ధరణే ఉండాలి. ఉన్న సర్కారునే కోరుకుంటున్నం.– మద్దుల బాల్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు, గుమ్మడిదల



### కరెంట్ కష్టాలు గ్యారంటీ..

కాంగ్రెస్ పార్టీ ఖాళీ మాటలు మాత్రమే చెప్తుంది. వాళ్లు చెప్పింది ఏదీ చేయరు. ఇంతకు ముందు తొమ్మిది గంటల పాటు కరెంటు ఇస్తామని చెప్పి ఐదారు గంటలు మాత్రమే ఇచ్చారు. ఇప్పుడు కూడా ఏవేవో చేస్తామని చెప్తున్నరు. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులకు కష్టాలు తప్పవు. కరెంట్ కష్టాలు మాత్రం గ్యారంటీ.

– ప్రవీణ్‌కుమార్, రైతు, దిగ్వాల్, కోహీర్ మండలం

### ధరణి లేకపోతే ఎలా....?

ధరణి ఉండడంతో రైతులకు చాలా మంచిగ జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ వాళ్లు మళ్లీ పట్వారీ వ్యవస్థను తీసుకువచ్చి పట్టాదారులు, కౌలు రైతుల మధ్య గొడవలు పెట్టేందుకు చూస్తున్నరు. ధరణి ఉండడంతో కేవలం ఐదిహేను నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్ అవుతున్నది. పట్వారీ వ్యవస్థ ఉంటే చెప్పలేని కష్టాలు వస్తాయి.

– రాచన్న ముదిరాజ్, రైతు, ఖానాపూర్, కోహీర్ మండలం



### కాంగ్రెస్‌ను నమ్మే కాలం పోయింది



కాంగ్రెసోళ్లు చెప్పే మాటలకు ఏమాత్రం పొంతన లేదు. వారు చెబితే నమ్మే కాలం పోయింది. 6 గ్యారెంటీ పథకాలపై వారికే పక్కాగా భరోసా లేదు. ప్రజలకు ఎట్లా భరోసా ఇస్తరు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తం. రైతులంతా బాగా ఆలోచించి ఓటెయ్యాలి. కాంగ్రెస్‌కు ఓటేస్తే కొరివి చేత పట్టుకున్నట్టే. వ్యవసాయమంటే తెలియని ఆ పార్టీ నాయకులు, మాయమాటలు చెప్పి అమాయక రైతులను నమ్మించాలని చూస్తున్నరు. 24 గంటలు కరెంటు ఉచితంగా ఇచ్చే సీఎం కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– కంగ్టి శ్రీనివాస్ సాగర్, రైతు, చిన్న ముబారక్‌పూర్, సిర్గాపూర్ మండలం

### కాంగ్రెస్ వస్తే ఎవుసం ఏడ్చినట్టే..



60 ఏండ్లు ఏలినా కాంగ్రెసోళ్లు చేసింది ఏమీ లేదు. అప్పట్లో కరెంట్ లేక ఎవుసం ఏడిచ్చింది. తీగల మీద బట్టలు ఆరేసుకునే దుస్థితి. ఇప్పుడు మూడుగంటల కరెంట్ ఇస్తే రెండెకరాలు ఉన్న ఎవుసంభూమిల ఎకరే సాగు చేయాలా? 24 గంటల కరెంట్ ఇచ్చే సర్కారును వదులుకోని మూడుగంటల కరెంట్ ఇచ్చేటోళ్లకు, పెద్దమోటర్లు పెట్టుకుని ఎవుసం చేసుకోమనేటోళ్లకు అప్పగిస్తే రాష్ట్రం 10 ఏండ్లు ఎనక్కిపోతది. మారైతులను కండ్లపెట్టుకుని చూసుకునేది బీఆర్ఎస్ సర్కారే. రైతులు అండగా ఉండేది సీఎం కేసీఆరే.

– రౌతు నరేశ్, రైతు, గుమ్మడిదల

### కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే కరెంట్ అంతే సంగతులు..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్‌కు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుత ప్రభుత్వం సరఫరా చేస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో వ్యవసాయదారుడు సుఖంగా జీవిస్తున్నాడు. గతంలో పాలించిన కాంగ్రెస్ కేవలం 9 గంటల కరెంట్ సరఫరా మాత్రమే చేసేది. రోజులో ఉదయం 3 గంటలు, మధ్యాహ్నం 3 గంటలు, రాత్రి 3 గంటల సరఫరా చేసేవారు అందులో చాలా వరకు కరెంట్‌కోత ఉండేది. రాత్రివేళలో కరెంట్‌సరఫరా చేస్తే అనేక ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. చాలా మంది రైతులు పాముకాటుతో, కరెంట్‌షాక్‌తో మృతిచెందే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 24గంటల ఉచిత కరెంట్‌తో ఇబ్బందులు ఏం లేవు.



– సాయిగౌండ, ముర్కుంజాల్, కంగ్టి మండలం

### రైతులపాలిట శాపంగా మారిన కాంగ్రెస్



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతుబంధు అడ్డుకున్నది సరిపోక వ్యవసాయానికి మూడు గంటల కరెంటు ఇస్తాం, 10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తామంటూ రైతులపాలిట కాంగ్రెస్ పార్టీ శాపంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో రైతులు వ్యవసాయాన్ని సంతోషంగా చేసుకుంటుంటే కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమే. త్వరలోనే వారికి ఓటుతో బుద్ధి చెప్పడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు.

– మధుసూదన్‌గౌడ్, హత్నూర

### 10 హెచ్‌పీ మోటరు పెట్టే స్థోమత రైతులకు ఉంటదా?



మూడు గంటల కరెంట్ ఇస్తాం, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుని పొలానికి నీరుపెట్టుకోవాలనుకోవడం సిగ్గుచేటు. ఆ మోటరు పెట్టుకోవాలంటే కనీసం లక్ష రూపాయలు కావాలి. మరి లాగోడికి ఎట్లా. అయినా బోరుబావిల 10హెచ్‌పీ మోటరుతో నడిపించే నీళ్లు ఉండాలికదా. రైతులకు 5హెచ్‌పీ, 3హెచ్‌పీ మోటరు ఉంటేనే చాలు. మూడు గంటల కరెంట్ అసలు సరిపోదు. ఎవుసం చేసేవాడికే తెలుస్తది రైతుల బాధలు. గతంలో కాంగ్రెసోళ్లు రైతులకు ఎలా కరెంట్ ఇచ్చారో ఆ బాధలను అనుభవించాం. మా బాధలను అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ మమ్మల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుడు.

– రమణారెడ్డి, రైతు, నాయకుడు, గుమ్మడిదల